ప్రజాసేవలకు సెలవేనా..?

- సచివాలయాల సేవలను కుదిస్తున్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్‌లు
- రేషన్‌కార్డుదారులు, పింఛన్‌దారులకు ఇబ్బందులు
- ఆందోళనలో ప్రజలు



కొండ్రాజుపల్లె సచివాలయం

కాశినాయన : మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలనే ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రాలకు వెళ్ళకుండా ఉన్న గ్రామాల్లోనే సచివాలయాల్లో సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయాల సేవలకు తూట్లు పొడుస్తుంది. ప్రజాసేవలకు కోత విధిస్తుంది. ప్రజలకు అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, రైతుభరోసా వంటి వెబ్‌సైట్‌లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. ప్రజాసేవలను క్రమేనా తగ్గిస్తూ వస్తుంది. ప్రస్తుతం కేవలం సచివాలయాల్లో ఆదాయ, కుల ధృవీకరణపత్రాలు, 1బి వంటి సాధారణ సేవలు అందిస్తున్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయాల సేవలు నిలిపివేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెల్లోనే సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. సచివాలయాలకు అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలను అందించేవారు. దీంతో ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు చేసేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడి దాదాపు 5 నెలలు కావస్తున్నా సంక్షేమ పథకాలపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సచివాలయాల్లో వెబ్‌సైట్‌లు ఓపెన్ చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెబ్‌సైట్‌లు ఓపెన్ చేయాలి



గ్రామ సచివాలయాల్లో సంక్షేమ పథకాల వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయాలి. దాదాపు ఎన్నికలకు ముందు మూడు నెలలు, ఎన్నికల తర్వాత ఐదు నెలలు మొత్తం కలిపి ఎనిమిది నెలలు వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో అర్హులైన పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే వెబ్‌సైట్‌లు ఓపెన్ చేయాలి.

– శేషారెడ్డి, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

దరఖాస్తులు స్వీకరించాలి



గ్రామ సచివాలయాల్లో కొత్తగా వివాహమైన వారు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని వెళితే వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని సచివాలయ ఉద్యోగులు సమాధానమిస్తున్నారు. అధికారులు స్పందించి రేషన్‌కార్డు దరఖాస్తులు స్వీకరించాలి.

– చెంచయ్య, నాయునిపల్లె, కాశినాయన మండలం

లబ్ధిదారులకు నోటీసులు పంపడం అన్యాయం


హౌసింగ్ డీఈ ప్రభాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : జగనన్న కాలనీల్లోని హౌసింగ్ లబ్ధిదారులకు నోటీసులు పంపడం అన్యాయమని, ఎందుకు నోటీసులు ఇచ్చారో చెప్పాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి కోరారు. సోమవారం ఆయన స్థానిక హౌసింగ్ కార్యాయలంలో డీఈ ప్రభాకర్‌కు ఈ మేరకు వినతి పత్రం అందించారు. పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు జగనన్న కాలనీల్లో 23011 ఇళ్లను కేటాయించిందన్నారు. అయితే హౌసింగ్ అధికారులు లబ్ధిదారులకు రూ.20వేల అడ్వాన్స్ రూపంలో చెల్లించారని, ఇల్లు నిర్మించుకోకుంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా బిల్లులు రావాని నోటీసులు ఇచ్చారన్నారు. జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడతో ఇళ్లు నిర్మించుకోవడంలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇవేవి పట్టించుకోకుండా అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు శివరామకృష్ణ, ఓబుళరెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

బద్వేలు అర్బన్ : చదువుకుంటున్న విద్యార్థినులకు చిన్న వయస్సులోనే బాల్యవివాహాలు చేయడం వలన ఇబ్బందులు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బలక్ష్మి, అరుణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కిషోరి వికాసం వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు మిషన్ వాత్సల్య, వ్యక్తిగత భద్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసీ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రతిరూప్, మహిళా సంరక్షణ కార్యదర్శులు మీనా, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లను నాయకులు, విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఏఐఎస్ఎఫ్ ముందుందన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో కడపలో మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు హాజరై విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలకు కార్యాచరణ చేస్తారన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు నాని, సమీ, మౌనిష, ధనుష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు పరిశీలన

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపును ఎంపీడీఓ వెంగముని రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆధార్ కేంద్రాల ద్వారా విద్యార్థులు తగిన మార్పులు చేసుకొనే అవకాశం వచ్చిందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

గోపవరం : మండలంలోని సూరేపల్లె, వడ్డెపాలెం గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ, దివంగత రాచపూడి నాగభూషణం జయంతి సందర్భంగా వారి కుమారులు బద్వేలు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయి క్రిష్ణ, వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ ఆర్.దిలీప్‌గుప్తల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ క్రిష్ణవేణి, డాక్టర్ శిరీషలు పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు.

సాగు సాయం ఇంకెప్పుడిస్తారు!


సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

మైదుకూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు సాగు సాయం ఎప్పుడిస్తారో సీఎం చంద్రబాబు నాయుడు తెలపాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ డిమాండ్ చేశారు. సంఘం పిలుపులో భాగంగా రైతాంగ సమస్యలపైన మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ సచివాలయంలో, 11వ సచివాలయంలో సోమవారం భాస్కర్ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20వేలు సాయం కింద ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ఇంత వరకు సాగు సాయం మాట మాట్లాడటం లేదని విమర్శించారు. ఈ రబీ సీజన్‌లోనైనా రైతులకు రూ.20వేలు సాగు సాయాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీ కెనాల్ ఆయకట్టు పరిరక్షణకు రాజోలి రిజర్వాయర్‌ను వెంటనే నిర్మించాలన్నారు. ప్రభుత్వం రాయలసీమ జిల్లాల్లో 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని, కరువు మండలాలుగా ప్రకటించిన 54 మండలాల్లో కడప జిల్లాలో ఒక్కటి కూడా లేకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద పుల్లయ్య, జిల్లా సమితి సభ్యులు గోశెట్టి రామ్మూర్తి, బీవీ శ్రీనివాసులు, కొట్టే రామ్మోహన్, కొమ్మినేని లక్ష్మయ్య, కూశెట్టి రాయుడు, ఎ.రఘు, బీవీ బాలాజీ, కొమ్మినేని ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో వినూత్న పద్ధతులు చేపట్టాలి


మాట్లాడుతున్న ఏడీఏ ఎం.నాగరాజ

అట్లూరు : రైతులు వినూత్న వ్యవసాయ పద్ధతులు అవలంభించి, అధిక దిగుబడి సాధించాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలోని సోమవారం రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులతో సమీక్ష, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగు పంటకోత ప్రయోగాలను శాస్త్రీయంగా సకాలంలో రైతుల భాగస్వామ్యంతో నిర్వహించాలని తెలిపారు. బీడు భూములను సాగులోకి తెచ్చేలా రైతులను పోత్సహించాలన్నారు. వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతు సేవాకేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సత్యనారాయణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో ఈనెల 6న సీపీఎం మూడవ మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు పార్టీ సభ్యులందరూ హాజరై జరిగిన మూడేళ్లలో చేసిన కార్యక్రమాలను సమీక్ష చేసుకుని రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధన కోసం ఆందోళనలు రూపొందిస్తామన్నారు. రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్ హామీలను నెరవేర్చడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వీటిపై ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమాలు చేస్తామన్నారు. మహాసభలకు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఎం నాయకులు పి.శేఖర్, చెన్నారెడ్డి, శ్రీను, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా అగ్నిమాపక అసిస్టెంట్ అధికారి రఘునాథ్

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలపై నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అసిస్టెంట్ అధికారి రఘునాథ్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ నష్టాలను తగ్గించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని వివరించారు. ఇళ్లలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఒత్తిడికి లోనుకాకుండా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్కువగా గ్యాస్ సిలిండర్ ద్వారా సంభవించే అవకాశం ఉంటుందన్నారు. గ్యాస్ సిలిండర్లలో మంటలు వ్యాపించినప్పుడు ఎలా ఆర్పాలో డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, ఫైర్ సిబ్బంది నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి గౌరీశంకర్, డాక్టర్ నరసింహా, ఎన్‌వైకే వలంటీర్లు సురేంద్ర, శరత్ చంద్ర, రవి యాదవ్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్

పోరుమామిళ్ల : దళిత యువకులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలని ప్రముఖ న్యాయవాది ప్రభాకర్, జోకోబ్, లెక్చరర్ నరసింహులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగ యువత చైతన్య సదస్సులో వారు మాట్లాడుతూ నేటి యువత సెల్‌ఫోన్ మోజులో పడి సమయాన్ని దుర్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. యువత మేలుకొని అసమానతలు లేని సమాజం కోసం కృషి చేయాలని కోరారు. జాతికి అన్యాయం జరిగితే పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో నాయకులు పిచ్చయ్య, రాజు, ఏసురత్నం, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికార్ జనరల్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

కడప రోమన్ క్యాథలిక్ మిషన్‌లో పెద్దదైన పోరుమామిళ్ల డీన్‌లో వికార్ జనరల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కడప పీఠాధిపతులను బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధన కమిటీ వ్యవస్థాపకులు సగిలి జాకోబ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల డీన్‌లో అత్యధికంగా క్రైస్తవులున్నారని, 3 సంవత్సరాలకు ఒకసారి విచారణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వాలని, మహిళలకు టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులు లేని పిల్లలను ఆదుకోవాలని కోరారు.

నైపుణ్య గణనను పక్కాగా చేపట్టాలి!


నైపుణ్య గణన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వీర కిషోర్

చాపాడు : మండల వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న నైపుణ్య గణన సర్వే–2024ను పక్కాగా చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం గ్రామ సచివాలయాల సిబ్బందికి నైపుణ్య గణన సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నైపుణ్య గణనలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి 15–59 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగులను, వారిలో ఉన్న స్కిల్స్‌ను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం సర్వే ఆధారంగా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తుందన్నారు. నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారన్నారు. మాస్టర్ ట్రైనర్లు చంద్ర యాదవ్, విజయరాజులు శిక్షణ ఇచ్చారు.

అట్లూరు: నైపుణ్య గణన పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడి 59 సంవత్సరాలు లోబడిన వారి విద్యా అర్హతలు, సామాజిక, ఆర్థిక, స్థితిగతులు, వారి ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆసక్తి, ప్రస్తుత ఉపాధి తదితర వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శిరీషా, పంచాయితీ విస్తరణ అధికారి శివప్రసాద్, మండల కో ఆర్డినేటర్ నరసింహులు, ట్రైనర్లు సంపత్‌కుమార్, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ గణన

బి.కోడూరు : ప్రతి మనిషిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ఆ నైపుణ్యంలో రాణించేలా చేయడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా నైపుణ్య గణన మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళా చట్టాల గురించి తెలుసుకోవాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి

మైదుకూరు : మహిళా చట్టాల గురించి విద్యార్థినులు తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ పనిచేసే చోట, చదువుకునే చోట మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలను చేసిందన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త వై.విజయకుమారి మాట్లాడుతూ పిల్లలకు బాల్య వివాహాల వల్ల కలిగే పరిణామాల గురించి, పిల్లల సంరక్షణ చట్టాల గురించి వివరించారు. సూపర్‌వైజర్ జె.ప్రశాంతి, సూపర్‌వైజర్ కె.ఓబుళమ్మ, మహిళా పోలీసు శశికళ పలు అంశాలపై ప్రసంగించారు.

హరోం హర.. శంభో శంకర

కార్తీక దీపాలను వెలిగించిన భక్తులు


ముక్తిరామలింగేశ్వరాస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సైకత లింగం


ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో అల్లాడుపల్లె వీరభద్రస్వామి


నాగనాథీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న పూజారి


బద్వేలు అర్బన్ : రూపరాంపేట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ముక్తి రామలింగేశ్వరాలయం, అగస్త్యేశ్వరాలయం, అమృతేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని మహాశివునికి అభిషేకాలు చేశారు. అలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి పరమశివున్ని భక్తి శ్రద్ధలతో పూజించారు. స్థానిక రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరాలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు చేసి అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి భక్తులు స్వంగా అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక అగస్త్యేశ్వరాలయంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకాలు చేశారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మైదుకూరు : కార్తీక మాస సోమవారం సందర్భంగా మైదుకూరులోని శ్రీపార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి స్వామివారికి పూజలు నిర్వహించారు.

మార్మోగిన శివనామస్మరణ

చాపాడు : కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని ముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవాలయం సోమవారం శివనామ స్మరణతో మార్మోగింది. ఆలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచే వీరభద్రస్వామి, భద్రకాళీమాత, కేథారీశ్వరుడు లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రమంలో భక్తులు శివనామ స్మరణలతో ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల నడుమ వీరభద్ర స్వామి భద్రకాళీమాత ఉత్సవ మూర్తులకు పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు.

శివాలయాల్లో వేడుకగా కార్తీక పూజలు

ఖాజీపేట : కార్తీక మాసం పరమశివునికి ప్రత్యేకమైనది. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఖాజీపేట మండలం పుల్లూరు సమీపంలో కొలువైన నాగనాధీశ్వరుడిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము అభిషేకాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా కార్తీకమాసం ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్ : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని పలు శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. ఆయా ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్తీకమాసంలో చేసే పూజాఫలం వలన భక్తులకు కష్టాలు తీరి కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తులలో మెండుగా ఉండటంతో భక్తులు శివాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

కాశినాయన : మండలంలోని ప్రజలు మొదటి కార్తీక సోమవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కత్తెరగండ్ల శివాలయం, కణికెలగుండం, అక్కంపేట విభూది శివాలయం, వరికుంట్ల శివాలయం, జ్యోతిక్షేత్రం శివాలయాలకు భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తెల్లవారుజామునే కార్తీక దీపాలు వెలిగించారు. కత్తెరగండ్ల శివాలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కళకళలాడిన శివాలయాలు

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె వద్ద గల శ్రీఅఖిలాండేశ్వరి బ్రహ్మానంద ఆశ్రమంలోని 108 శివలింగాలు, మున్నెల్లి గ్రామ సమీపాన సగిలేరు ఒడ్డున వెలసి ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

అన్నదానం


భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మన్నె చెన్నారెడ్డి, ఆయన భార్య ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు వీరరాఘవరెడ్డి, కుమార్తె మనోజ్ఞ, అల్లుడు సుబ్రహ్మణం రెడ్డి 600 మందికి అన్నదానం ఏర్పాటు చేశారన్నారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ (బాడీబిల్డింగ్) పోటీల్లో ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగిన వైవీయూ పోటీల్లో బీఏ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు పవర్ లిఫ్టింగ్ 83 కేజీల విభాగంలో ఎస్.సోహెల్, 93 కేజీల విభాగంలో పి.ప్రభాకర్‌రెడ్డి, బెస్ట్ ఫిజిక్ 60–65 కేజీల విభాగంలో బీకాం ఫస్ట్ ఇయర్ విద్యార్థి జి.భూషణ్ వర్మ ఈ ముగ్గురు బ్రాంజ్ మెడల్ సాధించారని వివరించారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ ఎల్ఏ నిషాల్ అభినందించారు.

ఆక్రమణల ఫిర్యాదుపై జాయింట్ సర్వే


నిర్మాణంలో ఉన్న భవనాన్ని సర్వే చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీరాములపేట వీధిలో నిర్మాణాలపై సోమవారం మున్సిపల్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. భవనానికి ముందు, వెనుక భాగంలో మున్సిపల్ స్థలం ఆక్రమించి భవనం నిర్మిస్తున్నారని 13వ వార్డు కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్ బాషా పలుమార్లు కౌన్సిల్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరగడంతో సర్వే నిర్వహించాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. జాయింట్ సర్వే నిర్వహించి నివేదిక ఇస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గత సమావేశంలో చెప్పారు. ఆ మేరకు ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌తోపాటు టౌన్ ప్లానింగ్ అధికారులు, భవన యజమానికి సంబంధించిన సర్వేయర్లు సర్వే చేశారు.

నాగార్జునరెడ్డికి సన్మానం


నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న అట్లాంటా తెలుగు అసోసియేషన్ సభ్యులు

పోరుమామిళ్ల : అమెరికాలోని అట్లాంటాలో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డిని అట్లాంటా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యం ఘనంగా సన్మానించారు. అట్లాంటాలో దీపావళి వేడుకల్లో నాగార్జునరెడ్డి ఆదివారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోవడాన్ని అక్కడ వైఎస్సార్ అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు అసోసియేషన్ సభ్యులు వెంకట్రామిరెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సత్యనారాయణరెడ్డి, శివ, రమేష్‌చంద్ర పాల్గొన్నారు.

రైతులకు సమస్య లేకుండా చూస్తాం

గోపవరం : మండలంలో వివిధ పంటలు సాగు చేసే రైతాంగానికి ఇబ్బంది లేకుండా చూస్తామని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. 'మండలానికి రెగ్యులర్ అధికారిని నియమించరా' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై ఏడీఏ స్పందించారు. గతంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న అరవిందనాయక్ స్టడీలీవ్‌పై వెళ్ళడంతో ఆయన స్థానంలో కొత్తవారిని నియమించేందుకు వీలు లేకపోవడంతో అట్లూరు మండలంలో ఏఓగా పనిచేస్తున్న రామకృష్ణయ్యను ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఇక నుండి ఇన్‌చార్జిగా ఉన్న రామకృష్ణయ్య అక్కడ, ఇక్కడ రెండు చోట్ల పని చేసే విధంగా చూస్తామని తెలిపారు.

బద్వేలు ఇన్‌చార్జి డీఎంగా కన్యాకుమారి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ బద్వేలు ఇన్‌చార్జి డీఎంగా కన్యాకుమారిని నియమిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడపలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కన్యాకుమారిని బద్వేలు ఇన్‌చార్జి డీఎంగా నియమించారు.